క్లుప్తంగా

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసంలో పవిత్రోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వహణ కార్యదర్శి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చాంద్రమాన శ్రీ క్రోధి నామ సంవత్సర కార్తీక బహుళ దశమి సందర్భంగా సోమవారం ఉత్సవాలు ప్రారంభమై కార్తీక బహుళ ద్వాదశి బుధవారం ముగుస్తాయని చెప్పారు. ఆలయం అర్చకులు వాసుదేశాచార్యులు, శేషాచార్యుల పర్యవేక్షణలో త్రయాహిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంతో గోవింద అర్చక బృందం ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేశామని ప్రసాద్ తెలిపారు.

సమాజ సేవకు ముందుకు రావడం అభిందనీయం


క్రిస్టియన్ మైనారిటీ కౌన్సిల్‌ను ప్రారంభించిన ఎంఏ పాల్

సీతమ్మధార: సామాజిక సేవకు క్రైస్తవ యువకులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని బిషప్ డాక్టర్ ఎంఏ పాల్ తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోగల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శనివారం క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ నాయకులు సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవడం హర్షణీయమన్నారు. సీఎంసీ చైర్మన్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి సంస్థలో సభ్యులుగా చేరడం సంతోషదాయకమని తెలిపారు. సంస్థ జనరల్ సెక్రెటరీ జేమ్స్, క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఈశ్వర్ డానియల్, ఈశ్వర్, బాలరాజు, విజయదాస్, లాస్య మోజెస్ డేవిడ్, ప్రకాష్ పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా కాల భైరవ జయంతి


శ్రీలలితాపీఠంలో కాలభైరవ హోమం పూర్ణాహుతి

సీతంపేట: కాలభైరవ జయంతి, బహుళ అష్టమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితాపీఠంలో విశేష పూజా కార్యక్రమాలు, కాశీ కాలభైరవులకు ఏకవార అభిషేకం జరిపించారు. పండితుల వేదమంత్రాల మధ్య కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కాశీ భైరవులకు వడ మాలలు వేసి ,హోమంలో పాల్గొన్నారు. అలాగే సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరస్వామి సమక్షంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ జరిగింది. ముందుగా స్వామి వారికి సహస్ర నామార్చన, విశేష హారతులిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దాడి కేసులో యువకుడికి రిమాండ్

సీతమ్మధార : ఓ వ్యాపారిపై దాడి కేసులో నిందితుల్లో ఒకరికి శనివారం న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతమ్మపేట రెల్లివీధికి చెందిన కొందరు యువకులు ఓ దుకాణం వ్యాపారిపై దాడికి పాల్పడడం తెలిసిందే. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్ దరిలో కె.సుబ్బరాజు కర్రీ పాయింట్, పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఐదుగురు షాపు వద్దకు వచ్చి పండ్లు (వారుతెచ్చుకున్న) కట్ చేసుకునేందుకు కత్తితో పాటు కవర్ అడగారు. దీంతో కవర్లు లేవని వ్యాపారి చెప్పడంతో వీరంతా దాడికి పాల్పడ్డారు. సుబ్బరాజు తీవ్రంగా గాయపడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సతీష్ పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమండ్ విధించారు. మిగిలిన వారు మైనర్లు కావడంతో ప్రభుత్వ బాలుర వసతిగృహానికి తరలించినట్లు ద్వారకా ఎస్ఐ శ్రీను చెప్పారు.


వరాహగిరి కాలనీలో వెలగని స్ట్రీట్‌లైట్


రంగు మారిన స్ట్రీట్‌లైట్, ఈ లైట్ పగలూ రాత్రి వెలుగుతూనే ఉంది


హైవే నుంచి నరసింహనగర్ రైతుబజార్‌కు వచ్చే జంక్షన్‌లో హైమాస్ట్ లైట్స్

వెలగవు.. వెలిగితే ఆరవు

- వార్డులో వీధి దీపాలు లేక ఇబ్బందులు
- కొన్ని చోట్ల పగలు కూడా ఆర్పని దీపాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల చీకట్లు అలుముకుంటుంటే, మరికొన్ని చోట్ల పగలూ, రాత్రి తేడా లేకుండా దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. అయినా వీటిని పట్టించుకునే నాథుడు లేరని స్థానికులు వాపోతున్నారు.

వార్డు పరిధిలో అధికశాతం ప్రజలు నివసించే కొండవాలు ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య అధికంగా ఉంది. సత్యసాయినగర్, సింహగిరికాలనీ, వరాహగిరికాలనీ ప్రాంతాల్లో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. వీటిపై ఫిర్యాదులు చేసినా ఎవరూ స్పందించడం లేదని, నిత్యం చీకట్లో గడపాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. చీకటి పడ్డాక ఇంటికి చేరే ఉద్యోగులు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే కొండవాలు ప్రాంతాలు, ఓ పక్క శునకాలు, మరో పక్క విషసర్పాల నుంచి ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తోందనని భయపడుతున్నారు.

రంగుమారిన లైట్లు

వరాహగిరికాలనీ–2లో కొన్ని చోట్ల స్ట్రీట్ లైట్స్ (110బి/11/3 పోల్ నెంబర్) వేసి చాలా కాలం అయినందున, పసుపు రంగు మారి వెలుతురు తగ్గిపోయాయి. వెలుగు లేని దీపాలతో అధికారులు నెట్టుకొస్తున్నారు. ఇదే ప్రాంతంలో అదనపు స్ట్రీట్‌లైట్స్ అవసరమైనా వేయడం లేదు. గతంలో ఈ ప్రాంతంలో గల శివాలయం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ వేసిన స్తంభాలకు ఇంకా మూడు నుంయి నాలుగు దీపాలు వేయకుండానే వదిలేశారు. దీనిపై కూడా అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు.

హైవేపై వెలగని హైమాస్ట్ లైట్

ఇక కాలనీల సంగతి ఇలా ఉంటే నరసింహనగర్ రైతుబజార్‌కు వచ్చే హైవే జంక్షన్ వద్ద గల హైమాస్ట్ లైట్స్ గత నెల రోజులుగా వెలగడం లేదు. అసలే ప్రధాన రహదారి, ప్రధాన జంక్షన్ ఇక్కడ లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా సచివాలయ సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా తనిఖీ చేసి సమస్య తమది కాదని, విద్యుత్ శాఖదని చెబుతున్నారు. విద్యుత్ దీపాల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న లైంగిక దాడులు


సమావేశంలో పాల్గొన్న ఇస్కఫ్ ప్రతినిధులు

సీతంపేట: ఇస్కఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో శనివారం జరిగిన సమావేశంలో డిసెంబరు 15న జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన ఈ సంఘం నిర్వహణలో వచ్చేనెల 15న జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కెండేయులు ఇటీవల నగరంలో లా విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలల వ్యవధిలోనే లైంగికదాడులు ఎక్కువయ్యాయన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత జిల్లాలోనే ఇటువంటి దారుణ ఘటన జరగడం బాధాకరమన్నారు. లా విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా లైంగికదాడులు కలవరపెడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు టి.ఎస్.సుకుమారన్, సత్యాంజనేయ, మహ్మద్ అహ్మదున్నీసాబేగం, ఎం.మధుమతి, బి.విజయలక్ష్మి, జె.రాంప్రభు, సి.హెచ్.మధుబాబు, జి.సూర్యకుమారి, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆ ఒప్పందాలన్నీ రద్దు చేయాలి

సీతమ్మధార : సౌరవిద్యుత్ కొనుగోలు ఒప్పందం కోసం రూ. 2029కోట్ల మేరకు భారీ ముడుపులు అధికార, ప్రతిప్రతిపక్ష పార్టీలకు ముట్టజెప్పినట్లు అమెరికా తూర్పు న్యూయార్క్ జిల్లా కోర్టు తెలియజేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు గుర్తు చేశారు. అదానికి ప్రజల సంపదను దోచిపెట్టేందుకు ఈ భారీ అవినీతి బోటుచేసుకున్నట్లు స్పష్టమవుతోందన్నారు. భారీ ముడుపులు చెల్లించిన అదానీతో పాటు ముడుపులు తీసుకున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని, ఏపి ప్రభుత్వం చేసిన ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, వి.కష్టారావు, నాయకులు జి.అప్పలరాజు, కె.కుమారి, వై.రాజు, పి.వెంకటరావు, జి.వి.ఎస్.చలపతి, కుమార్‌మంగళం, అప్పారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు మానసిక దివ్యాంగురాలు


తల్లికి హర్షితను అప్పగిస్తున్న ద్వారకా పోలీసులు

సీతమ్మధార: నెల్లూరుకు చెందిన 18 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు హర్షితను ద్వారకా పోలీసులు శనివారం తల్లికి అప్పగించారు. కంట్రోల్ రూమ్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఫోర్త్ టౌన్ నైట్ బీట్ సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో యువతిని కనుగొని వివరాలు ఆరా తీశారు. తన పేరు హర్షిత అని, సొంతూరు నెల్లూరు జిల్లా నుంచి 14 రోజుల కిందట విశాఖ వచ్చేసినట్లు చెప్పింది. ఆరు రోజుల కిందట జీఆర్పీ పోలీసులు హర్షితను గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఉంచగా.. అక్కడ నుంచి వచ్చేసి, తిరిగి ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుండగా.. ఫోర్త్ టౌన్ పోలీసులు సంరక్షించారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌కి వచ్చిన ఆమె తల్లి హారికకి హర్షితను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ద్వారకా ఎస్ఐ శ్రీను, ఏఎస్ఐ గంగాధర్‌రెడ్డి, ఏఎస్ఐ అరుణకుమారి పాల్గొన్నారు.

చెక్కలకు వినియోగించే పాలిష్ తాగి వ్యక్తి మృతి

సీతమ్మధార : చెక్కలకు వినియోగించే పాలిష్ తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ముస్లిం తాటిచెట్లపాలెంలో షేక్ భాషా (45) కార్పెంటర్ వృత్తి చేస్తూ, భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఇతనికి మద్యం సేవించే అలవాటు వుంది. శుక్రవారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో చెక్కల పాలిష్‌ను తాగేశాడు. ఇది గమనించిన భార్య ఆందోళన చెందగా..తనకు ఏం కాదని దుసురుగా బదులచ్చాడు. అర్ధరాత్రి నోట్లోంచి నురగలు రావడంతో కంగారు పడిన భార్య బంధువులకు విషయం చెప్పగా..వారొచ్చి కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్ ద్వంద్వ వైఖరి


శివాలయం వద్ద కూల్చివేసిన మరుగుదొడ్లు


ఆక్రమణలు కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది


శివాలయం పక్కనే టౌన్‌ప్లానింగ్ వదిలేసిన ఆక్రమణలు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలన్నీ కూల్చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కొన్ని కూల్చేయడం, మరికొన్ని వదిలేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జోన్–3 పరిధి 24 వ వార్డు నక్కవానిపాలెంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వంద్వ వైఖరి అవలంభించారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక్కడి ఉమానీలకంఠేశ్వరాలయం (శివాలయం) ఆనుకుని వున్న ఆక్రమణలను శనివారం టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది కూల్చేశారు. ఇక్కడ నిర్మించిన మరుగుదొడ్లు తొలగించారు. అయితే పక్కనే వున్న ఆక్రమణల జోలికి వెళ్లకపోవడం గమనార్హం. ఈ పక్కనే పలు తోపుడుబండ్లకు ఎంచక్కా పరదాలు వేసి ఉన్నా వాటి జోలికి వెళ్లలేదు. ఆక్రమణలు కూల్చినపుడు అన్నీ తొలగించాలి గాని, కొన్ని తొలగించడం , మరికొన్ని వదిలేయడం ఏంటని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జోన్–3 పరిధిలో గల పలు ఆక్రమణల తొలగింపు విషయంలో సిబ్బంది ఇలాగే వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జోన్–3 ఉన్నతాధికారులు స్పందించి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ద్వంద్వవైఖరి అవలంభించకుండా కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఎన్ఎంయుఏ నేతలు

సీతమ్మధార : ఉత్తర నియోజక ఎమ్మెల్యే, ఎన్ఎంయుఎ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.విష్ణుకుమార్ రాజుకు శనివారం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీ చరిత్రలో ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా రవాణామంత్రిని కోరిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజును నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డివిజనల్ సెక్రటరీ ఎ.కె. శివాజీ, గాజువాక డిపో సెక్రెటరీ పిళ్లా.శంకరరావు, రీజినల్ నాయకులు కేఎస్ఎన్ మూర్తి,సింహాచలం తదితరులు స్వాగతం పలికారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: పవన్‌కల్యాణ్ కళాపీఠం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మెగా సంగీత విభావరి నిర్వహించారు. ఏపీఫిల్మ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు ముఖ్య అతిథిగా పాల్గొని విభావరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో సినిమా రంగానికి అవసరమైన అపారమైన వనరులు ఉన్నాయని, ఏపీకి సినీ పరిశ్రమ తరలివచ్చేలా కూటమి నాయకులంతా కృషి చెయ్యాలని కోరారు. అనంతరం గాయనీ గాయకులు ప్రముఖ చిత్రాలలోని హిట్ సాంగ్స్ పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కార్పొరేటర్ కందుల నాగరాజు, బొడ్డేపల్లి రఘు, కళాపీఠం ప్రతినిధులు గెంబలి జగదీష్, మెరుపు వరప్రసాద్, హరిప్రసాద్, కె.ఇందిరా ప్రియదర్శిని, కళా సంఘాల ప్రతినిధులు చెన్న తిరుమలరావు, సన్‌మూర్తి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణపై ప్రధాని ప్రకటన చేయాలి

సీతమ్మధార: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని ప్రకటించాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఈనెల 26న నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖలో అన్ని వర్గాల ప్రజలు 1,400 రోజుల నుంచి ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించకుంటే.. ఆంధ్ర రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసి నట్లేనన్నారు. నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం, రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిషన్ మార్చా పిలుపు మేరకు భారీ ప్రదర్శన సభలు జరుగుతున్నాయన్నారు. విశాఖలో ఆ రోజు ఉదయం దొండపర్తి రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన సభ జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కార్మిక ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో సత్యసాయిబాబా

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం జాతీయ రహదారిలో గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఆలయం 25వ వార్షికోత్సవాన్ని, సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, పూర్ణ కలశస్థాపన చేశారు. సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజన సంకీర్తన నిర్వహించారు. తిరువీధిలో సత్యసాయి బాబా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు.


పోర్టు స్టేడియంలో సత్యసాయి భజన చేస్తున్న భక్తులు

సీతంపేట: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు సత్యసాయి బాబా వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. వాకర్స్ సత్యసాయి కీర్తనలు ఆలపించి, సత్యసాయి బోధనలు వినిపించి,భజన చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విఠల్, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో వాటా కోసం పోరాడాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

సీతంపేట: దేశ సంపద సృష్టికర్తలమైన మనం ఉచిత పథకాల కోసం పాకులాడకుండా సంపదలో , రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం పోరాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి అన్నారు. శ్రామికులు శ్రమిస్తేనే సంపద పుడుతుందని, ఆదానీ, అంబానీలు సంపద సృష్టికర్తలు కాదన్నారు. 'కులగణన, సామాజిక న్యాయం' అను అంశంపై స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మన నోరు మూయించడానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని , మనకు రావాల్సిన వాటా పొందడం మన హక్కుగా భావించాలన్నారు. మనం సృష్టిస్తున్న సంపదలో 60 శాతం సంపన్న వర్గాలకే పోతోందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించారని, ఆయన ఆశయాలను మనం సాధించలేకపోతున్నామని తెలిపారు. రిపబ్లికన్‌పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలు రాజకీయ లబ్ధి కోసమేనని, మన హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ కుల గణన జరగాలని, దళితుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, జి.రాంబాబు, కిరణ్‌కుమార్, టి.కాంతారావు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వార్షికోత్సవం


వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మల్లికాంబ


విద్యార్థుల నృత్య ప్రదర్శన

సీతమ్మధార : స్థానిక ఎస్ఎఫ్ ఎస్ సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వయిజర్, అకౌంట్ ఆఫీసర్ ఆర్.మల్లికాంబ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కన్నకలలు నెరవేర్చేలా కష్టపడి చదవాలని కోరారు. ప్రతి విద్యార్థీ నిర్ణీత లక్ష్యం ఏర్పర్చుకుని వాటిని సాకారం చేసుకునే దిశగా పయనించాలన్నారు. ఈ సందర్భంగా వద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ విద్యా సంస్థల గ్రూప్ జనరల్ మేనేజర్ బి.సురేష్‌బాబు, కౌన్సిలర్ ఇన్‌చార్జు ఆఫ్ ఎడ్యుకేషన్ ఎం.జోజి, ప్రిన్సిపాల్స్ విజయకుమార్, మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం ఎస్ఐ కావలెను

- రెండు నెలలుగా భర్తీకాని పోస్టు
- ఫోర్త్‌టౌన్‌లో ముందుకు సాగని కేసుల దర్యాప్తు


ఖాళీగా ఉన్న క్రైం ఎస్ఐ సీటు

సీతమ్మధార : నగరంలోనే ఎంతో కీలకమైన నాలుగవ పట్టణ క్రైం ఎస్ఐ పోస్టు భర్తీకావడం లేదు. ఏ ముహూర్తాన ఇక్కడి క్రైం ఎస్ఐ బదిలీ అయ్యారోగాని ఒక పట్టాన ఈ పోస్టు భర్తీ చేయడం లేదు. వచ్చిన వారు కూడా కుదురుకునేముందే బదిలీ చేయడం గమనార్హం. ఇక్కడ క్రైం ఎస్ఐగా పనిచేసిన భాస్కరరావు ఈ ఏడాది జనవరి 19న ఎటాచ్‌మెంట్ కింద ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 19వ తేదీన బదిలీ మీద పీఎం పాలెం స్టేషన్‌కి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు పూర్తిస్థాయి అధికారితో భర్తీ కాకపోవడం గమనార్హం. ఫలితంగా దిగువస్థాయి సిబ్బంది అదనపు భారంతో అవస్థలు పడుతున్నారు. భాస్కరరావు బదిలీ తరువాత రెండో పట్టణ క్రైం ఎస్ఐ సునీల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కేవలం వారం రోజులకే సీసీఎస్‌కి చెందిన ఎస్ఐ దేముడునాయుడుకి ఎటాచ్‌మెంట్‌ఇచ్చారు. పట్టుమని పది రోజులు మాత్రమే వుండడం విశేషం. తరువాత ఆయన స్థానంలో హార్బర్ స్టేషన్‌కు చెందిన క్రైం ఎస్ఐ సురేష్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన కూడా పది రోజులకే బదిలీ కావడం గమనార్హం. ఇతని స్థానంలో మళ్లీ టూటౌన్ క్రైం ఎస్ఐ సునీల్‌కే రెండోసారి ఎటాచ్‌మెంట్ ఇచ్చారు. వాస్తవానికి మహారాణిపేట క్రైం ఎస్ఐగా పనిచేస్తున్న సత్యారావు నాలుగవ పట్టణ క్రైం స్టేషన్ ఎస్ఐగా ఈ ఏడాది జూలైలో బదిలీ అయినా సరే ఇక్కడ జాయిన్ కాకపోవడం గమనార్హం. దీంతో ఇక్కడ క్రైం ఎస్ఐ పోస్టు నాలుగు స్తంభాలాట చందంగా ఉందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఎప్పుడు ఎవరు ఇన్‌చార్జి క్రైం ఎస్ఐగా ఉంటున్నారో తెలియడంలేదని ఫిర్యాదుదారులు ఆందోళన చెందుతున్నారు.

నత్తనడకన కేసుల దర్యాప్తు

పూర్తిస్థాయి క్రైం ఎస్ఐ లేకపోవడంతో ఫోర్త్‌టౌన్ పరిధిలో నేరాల కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోందని పలువురు గగ్గోలు పెడుతున్నారు. రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో హెడ్‌కానిస్టేబుల్, కేసులు దర్యాప్తు చేయాల్సి వస్తోంది. నగర పోలీసు కమిషనర్ దృష్టి సారించి ఫోర్త్‌టౌన్‌కు పూర్తిస్థాయి క్రైం ఎస్ఐను నియమించాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నకు డీఐజీ గోపీనాథ్ జట్టి పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జట్టి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ ఆయనకు అందించారు.